సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



ప్రశ్నించే గొంతుక..

దేశంలోని చారిత్రక అంశాలను వక్రీకరించినా.. వాటిని మార్చాలని చూసినా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ గొంతుకై నిలిచి ప్రశ్నిస్తుంది.

- 8లో▸



ఇంటర్ వర్సిటీ పోటీలకు జట్ల ఎంపిక

తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ మహిళా టోర్నమెంట్‌కు కేయూ వాలీబాల్ జట్టును ఎంపిక చేసినట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0° /17.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాతివేళ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'ప్రజా పాలన'పై సమావేశం

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనపై దృష్టిపెట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాల అమలుకు సన్నద్ధమైంది. ఇందులో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించేందుకు మంగళవారం హనుమకొండలో ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రులు సమావేశం కానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, వివిధశాఖల ఉన్నతాధికారులతో జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమవుతారు. ప్రజాపాలనపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలంటే ఏఐటీయూసీ గెలవాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని.. రాజకీయ జోక్యం పోవాలంటే ఏఐటీయూసీ గెలవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఏరియాలోని కేటీకే 8, 6వ గనులలో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరాలన్నారు. నూతన గనులు రావాలన్నా.. అనునిత్యం కార్మిక పక్షాన పోరాడే ఏఐటీయూసీనే అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక హక్కులను గతంలో సాధించిన చరిత్ర ఉందన్నారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శంకర్, విజేందర్, రామచందర్, శ్రీనివాస్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, రాజన్న, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కాటారం: కాటారం మండలం విలాసాగర్ యూత్ కాంగ్రెస్ నాయకుడు పూసల శశికాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్టెం సత్తయ్య, పప్పుల రాజయ్య, తెప్పెల అరవింద్, తరుణ్, వెన్నపురెడ్డి రవికాంత్, మధుకర్, సంతోష్, రాకేశ్, స్వామి పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి వేడుకలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో నేడు(మంగళవారం) దత్త జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మెర్గు సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దత్త జయంతి సందర్భంగా ఉదయం అభిషేకాలు, పుష్పార్చనలు, మధ్యాహ్నం హారతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ట్రస్మా క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 30 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పోశాల వీరమల్లు హాజరై మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులలో స్నేహభావం పెరగడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కబడ్డీలో లిబర్టీ స్కూల్ ప్రథమ బహుమతి, బ్రహ్మణీ స్కూల్ ద్వితీయ బహుమతి, ఖోఖోలో ప్రథమ బహుమతి బ్రహ్మణీ స్కూల్, ద్వితీయ బహుమతి ఆదర్శ స్కూల్, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి అరవింద స్కూల్, ద్వితీయ బహుమతి ఆదర్శ స్కూల్, క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి ఆర్‌ఎంసీ స్కూల్, ద్వితీయ బహుమతి బ్రహ్మణీ, చెస్‌లో లిబర్టీ ప్రథమ, సెయింట్ ఆంథోని ద్వితీయ, షటిల్‌లో వేదవ్యాస ప్రథమ, ద్వితీయ బహుమతి లిబర్టీ, క్రికెట్‌లో ప్రథమ బహుమతి లిబర్టీ, ద్వితీయ బహుమతి భవాని స్కూల్ విద్యార్థులు గెలుపొందగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు కొంగరి శ్రీనివాస్‌రావు, సురేందర్, అంబటి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆంక్షలే!

పోలీసుల పహారాలో లక్ష్మీ పంపుహౌస్, మేడిగడ్డ బ్యారేజీ

- లక్ష్మీపంపుహౌస్‌లో ఆరు మోటార్లు ఇప్పటికీ రాలే..
- మేడిగడ్డ మరమ్మతులు చేపడుతున్న ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థ
- 29న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు రాక
- మేడిగడ్డ వద్దనే కాళేశ్వరంపై పవర్ ప్రజెంటేషన్



కుంగిన మేడిగడ్డ బ్యారేజీ

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నేటికీ పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు అటువైపు ఎవరినీ కన్నెత్తి చూడనివ్వడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన లక్ష్మీపంపుహౌస్ భారీ వరదలతో మునిగి ఆరు మోటార్లు చెడిపోయి ఏడాదిన్నర గడిచినా ఇంకా ఇతర దేశాల నుంచి తేలేదు. మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాక్‌లో కుంగిన పిల్లర్‌కు మరమ్మతుల కోసం ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థ మూడు రోజులుగా కాఫర్‌డ్యాం నిర్మాణ పనులు చేస్తోంది. ఆ ప్రదేశాలను చూసేందుకు సందర్శకులకు మాత్రం పోలీసులు అనుమతించడం లేదు.

2022 జూలై 14న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి (మేడిగడ్డ)లక్ష్మీపంపుహౌస్ పూర్తిగా నీట మునిగింది. ఆ ఏడాది మునుపెన్నడూ లేనివిధంగా వర్షాలు కురవడంతో గోదావరి, ప్రాణహిత నదులకు వరదలు పోటెత్తాయి. అన్నారంలోని సరస్వతీ బ్యారేజీ వద్ద 17లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చింది. 66గేట్లు ఎత్తగా పై నుంచి పారింది. మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో 29లక్షల క్యూసెక్కుల వరద రాగా 85గేట్లు ఎత్తి ఉంచగా పై నుంచి పారి దిగువకు తరలిపోయిన విషయం తెలిసిందే. దీంతో భీకరమైన వరదతో నీటమునిగి మోటార్లు, ఇతర సామగ్రి చెడిపోయింది.

లక్ష్మీపంపుహౌస్..

కాళేశ్వరం సమీపంలోని లక్ష్మీపంపుహౌస్‌లో అప్రోచ్ కెనాల్ మీదుగా హెడ్‌రెగ్యులేటరీ గేట్ల గుండా వరద లీకేజీ అయింది. ఫోర్‌బేలోకి భారీగా వరద చేరి రక్షణ గోడ కూలింది. దీంతో పంపుహౌస్‌లోకి వరద చేరి నీటమునిగింది. రెండు భారీక్రేన్‌లు, ఇనుప నిచ్చెనలు, వాల్స్, ఆరు మోటార్లు చెడిపోయాయి. ఎలక్ట్రికల్ పరికరాలు, ఏసీలు, ప్యానల్ బోర్డులు నీటిలో తేలియాడాయి. పంపుహౌస్‌లోని రెండు, మూడవ టీఎంసీకి చెందిన 17 మోటార్లకు పదకొండు మోటార్లు సేఫ్‌గా ఉన్నాయి. ఆరు మోటార్లు చెడిపోయాయి. ఇంజనీరింగ్ అధికారులు కొన్ని మరమ్మతులు చేసి పంపులు రన్ చేశారు. ఆ ఆరు మోటార్లు నేటికీ ఇతర దేశాల నుంచి తీసుకురాలేదు. మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం ఉన్న 11 మోటార్లతో ఈ ఏడాది స్వల్పంగా ఎత్తిపోశారు. దీంతో పంపుహౌస్‌లోకి ఎవరినీ అనుమతించడం లేదు. 2022 జూలై నుంచి నేటి వరకు రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఎవరినీ అనుమతించడం లేదు. పోలీసు పహారాలోనే ఇప్పటికీ పంపుహౌస్ ఉంది.

మేడిగడ్డ బ్యారేజీ..

కాళేశ్వరం ప్రాజెక్టులోనే కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఈఏడాది అక్టోబర్ 21న భారీ శబ్దంతో 7వ బ్లాక్‌లోని 21వ పిల్లర్ కుంగింది. మరుసటి రోజు నుంచి అప్పటి ప్రభుత్వం బ్యారేజీ ప్రాంతాన్ని పోలీసుల వలయంలోకి తీసుకుంది. వారం రోజుల పాటు ప్రతిపక్ష నాయకులు హడావుడి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినా పోలీసు ఆంక్షలు ఎత్తివేయలేదని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం మూడు రోజుల నుంచి బ్యారేజీలో కాఫర్‌డ్యాం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మహారాష్ట్ర వైపున 7వ, 8వ బ్లాక్‌లో మట్టి, రాళ్లతో కాఫర్ డ్యాం పనులు చేపట్టారు. కానీ అటువైపు ఎవరూ వెళ్లకుండా పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంది.

అనుమతి ఇస్తే..

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో కాళేశ్వరానికి భక్తుల రాక పెరిగింది. భక్తులను కాళేశ్వరం సమీపంలోని లక్ష్మీపంపుహౌస్‌లోకి అనుమతిస్తే సందర్శకులు పెరిగే అవకాశం ఉంది. ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో పంపుహౌస్ ఉంది. దీంతో ఆలయంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు ప్రాజెక్టు వీక్షించే అవకాశం ఉంది. పోలీసు ఆంక్షలు అవసరమైన చోట ఉంచి మిగతా ప్రాంతంలో పూర్తిగా తొలగించాలని పలువురు కోరుతున్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులు



బ్యారేజీ వద్ద కారును ఆపేస్తున్న పోలీసులు

29న మంత్రుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఈనెల 29న ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు రానున్నారు. ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారని ఇంజనీరింగ్ వర్గాల ద్వారా తెలిసింది. షెడ్యూల్ మాత్రం ఇంకా ఖరారు కాలేదని తెలిసింది. కొత్తగా కొలువుదీరిన మంత్రులు ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ కాంట్రాక్టర్లతో ఇటీవల సమావేశం అయ్యారు. దీంతో 29న మేడిగడ్డ వద్దనే అన్ని బ్యారేజీల కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ శాఖ అధికారులతో పవర్ ప్రజెంటేషన్ ప్రాజెక్టర్ ద్వారా ఇవ్వనున్నారని తెలిసింది. బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణ సమయంలో చేపట్టిన ఆదాయ, వ్యయాలు, విద్యుత్ అవసరాలు, లాభ, నష్టాలు, ఆర్థికభారం గురించి విధివిధానాలు, సాగునీరు తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఉండనుందని తెలిసింది.

క్రిస్మస్ వేడుకలు



చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ వేర్వేరుగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. పాస్టర్‌లు ప్రసంగం వినిపించారు. వేడుకలను హాజరైన ముఖ్య అతిథులకు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పనులు ఆదివాసీ యువతకే కేటాయించాలి

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం మహాజాతరలో 50శాతం నామినేటెడ్ పనులు స్థానిక ఆదివాసీ యువతకు కేటాయించాలని మేడారం అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన భోజరావు ప్రభుత్వాన్ని కోరారు. మేడారంలోని అభ్యుదయ యువజన సంఘం కార్యాలయంలో యువజన సంఘం యూత్ సభ్యులు సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకొని జాతర పనులపై చర్చించుకుని పలు అంశాలపై తీర్మానాలు చేశారు. జాతరలో అమ్మవారి గద్దెలపై ఎత్తు బంగారం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే పనులతో పాటు జాతర సమయంలో నిర్వహించే అభివృద్ధి పనుల్లో 50 శాతం నామినేటెడ్ పనులు స్థానిక ఆదివాసీ యువతకే కేటాయించాలన్నారు. జాతర విజయవంతానికి స్థానిక ఆదివాసీ యువకులు కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఈ సమావేశంలో యూత్ సభ్యులు గడిగా అనిల్, సిద్దబోయిన రమేష్, సమ్మారావు, కొక్కెర పూర్ణ, ఆలం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వీరాపూర్‌లో బోనాల జాతర



కాటారం: బోనాలు ఎత్తిన మహిళలు

కాటారం: మండలంలోని వీరాపూర్‌లో మల్లికార్జున స్వామి బోనాల జాతర సోమవారం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు సమర్పించారు. మహిళలు బోనం మొక్కులు సమర్పించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీదేవర బోనాలు

పలిమెల: మండలంలోని బోడాయిగూడెంలో లక్ష్మీదేవర బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. బోనాల జాతర ఈ ప్రాంతంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. జాతరకు పలిమెల మండలంతో పాటు చుట్టూ పక్కల మండలాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బేగ్లూర్ గ్రామంలో..

మహదేవపూర్: మండలంలోని బేగ్లూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు బోనాలు ఎత్తుకుని మల్లన్న గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలు సమర్పించారు. రైతులు తమ ఎడ్లబండ్లతో గుడిచుట్టూ తిరిగారు. ఒగ్గు పూజరులు పూజలు నిర్వహించి పెద్ద పట్నాలు వేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు పూజారి గురువయ్య, సర్పంచ్, ఎంపీటీసీ చల్ల పద్మ-ఓదేలు, భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను అభివృద్ధి చేస్తాం..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: పదేళ్లుగా అస్తవ్యస్తంగా మారిన సింగరేణి సంస్థను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఏరియాలోని కేటీకే 5వ గని, సింగరేణి వర్క్‌షాపు, సింగరేణి ఏరియా ఆస్పత్రిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి ఇంటి సంస్థగా వాడుకుందని ఆరోపించారు. సింగరేణి సీఎండీ అప్పటి ముఖ్యమంత్రికి కార్మికుల సొమ్మును దోచిపెట్టినట్లు తెలిపారు. సీఎస్‌ఆర్ నిధులను మంత్రుల నియోజకవర్గాలకు మళ్లించినట్లు వివరించారు. కారుణ్య నియామకాల పేరుతో కార్మికుల నుంచి అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. మెడికల్ అన్‌ఫిట్‌ను అవినీతికి అడ్డాగా మార్చినట్లు తెలిపారు. ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే కార్మికులకు అండగా హక్కులను సాధించి పెడుతామన్నారు. ప్రతి కార్మికుడికి 200గజాల సొంత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి వడ్డీలేని రూ.20లక్షల రుణాలు అందిస్తామని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు ఆదాయ పన్ను నుంచి రాయితీ కల్పిస్తామని సూచించారు. ఏరియా ఆస్పత్రిలో వైద్య నిపుణులను నియమించి కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, పేరం రమేష్, రఘుపతిరెడ్డి, వేణుగోపాల్, నాగరాజు, మధుకర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ వైశిష్ట్యంపై సంపాదకులు బండి ఉష రూపొందించిన కవితా మహా సంకలనం పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం మేడారంలోని గద్దెల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంపాదకులు ఉష మేడారానికి వచ్చిన మంత్రి సీతక్కకు వనదేవతల వైశిష్ట్యంపై రూపొందించిన పుస్తకాన్ని బహుకరించారు. అనంతరం పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావును శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 529 పేజీలతో కూడిన ఈ పుస్తకం పాటలు, పద్యాల రూపంలో అమ్మవార్ల గొప్పతనాన్ని తెలిపేలా ఉంటుందని తెలిపారు. అమ్మవార్ల చరిత్రను పూజారుల ద్వారా తెలుసుకొని అమ్మవార్ల విశిష్టతపై త్వరలో మరో పుస్తకాన్ని ఆవిష్కరిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావును అమ్మవార్ల విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు.

జలుబు.. దగ్గు.. జ్వరం..

విజృంభిస్తున్న వ్యాధులు

- గొంతు నొప్పితో బాధపడుతున్న జనం
- మళ్లీ భయపెడుతున్న కరోనా
- ఇప్పటికే జిల్లాలో ఐదు కేసులు నమోదు



జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన కోవిడ్ వార్డు

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత పెరగడంతో పలు గ్రామాల్లో ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల జిల్లాలో ఒకే కుటుంబంలో ఐదుగురు కరోనా బారిన పడ్డారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ విభాగం రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజూ 150నుంచి 200 మందికి పైగా రోగులు రావడంతో ఆస్పత్రి నిండిపోతుంది. ఇటీవల చలి పెరిగి వాతావరణంలో మార్పులు రావడంతో జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి బారిన పడుతున్నారు.

వాతావరణ మార్పులతో..

వాతావరణ మార్పులతో జిల్లాలో ఒక్కసారిగా జ్వరాలు ప్రబలుతున్నాయి. చలి గజగజ వణికిస్తోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడంతో వృద్ధులు, చిన్నారుల్లో శ్వాస సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయి. చలి తీవ్రతతో జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులో చాలామంది దగ్గు, జ్వరం, జలుబు, గొంతు, ఒళ్లు నొప్పులతో వచ్చిన వారే ఉన్నట్లు వైద్యులు అంటున్నారు.

రోగులతో కిటకిట..

చలితీవ్రత కారణంగా జిల్లాలో ఒక్కసారిగా జ్వరాల కేసులు పెరిగాయి. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. చాలామంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచాన పడుతున్నారు. ముఖ్యంగా గొంతు నొప్పి ఎక్కువ మందిలో కనిపిస్తుండడంతో కరోనా అనే భయంలో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

కరోనా కలకలం..

జిల్లాలో జ్వరాలు ప్రజలను వణికిస్తుంటే మరో వైపు కరోనా కలకలం రేపుతోంది. వారం రోజులుగా రాష్ట్రంలో అక్కడక్కడా కరోనా కేసులు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కరోనా ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్-1 సబ్ వేరియంట్ రూపంలో భయపెడుతోంది. జిల్లాలోని గణపురం మండలం గాంధీనగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. పాజిటివ్ కేసులు నమోదుకావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉండడంతో పాటు వారానికి పైగా తగ్గకుండా ఉన్న వారికి కరోనా అనుమానం ఉంటే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రితో పాటు అన్ని పీహెచ్‌సీల్లో అనుమానితులకు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వైద్యులు, మందులు



వ్యాధులు ప్రబలుతుండడంతో జిల్లా ఆస్పత్రిలో మందులు, వైద్యులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నాం. పేషెంట్లు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కువగా దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి వంటి జబ్బుల బారిన ప్రజలు పడుతున్నారు. చాలామంది ఓపీ చూపించుకొని మందులు తీసుకొని వెళుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆస్పత్రిలో జాయిన్ చేసుకొని చికిత్స అందిస్తున్నాం. కరోనా లక్షణాలు, అనుమానం ఉన్న వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. కరోనా బాధితుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం.

- డాక్టర్ నవీన్‌కుమార్, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్

వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం..



జిల్లాలో కరోనా కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాం. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలి. కరోనా బారిన పడిన వారిని క్వారంటైన్‌లో ఉండాలని ఆదేశించారు. కరోనా బారిన పడిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుంది. చలితో బయటికి రాకూడదు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం.

- డాక్టర్ మధుసూదన్, డీఎంహెచ్‌ఓ

టీబీజీకేఎస్‌తోనే కారుణ్య నియామకాలు

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు తాకట్టుపెట్టిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియామకాలను మెడికల్ అన్‌ఫిట్ చేసి పునరుద్ధరించినట్లు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఏరియాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకటరమణారెడ్డి మాట్లాడారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని కోరారు. గతంలో రెండు దఫాలుగా గుర్తింపు సంఘంగా ఏ కార్మిక సంఘం చేయని పనులను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మికుల పక్షాన నిలిచి ఎన్నో హక్కులను సాధించినట్లు తెలిపారు. మెడికల్ బోర్డు ద్వారా కారుణ్య నియామకాల ద్వారా 13వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన కార్పొరేట్ వైద్య సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లను కట్టించినట్లు తెలిపారు. కార్మికుల ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల వడ్డీలేని రుణాలు ఇప్పించినట్లు చెప్పారు. కారుణ్య నియామకాల ద్వారా మహిళలకు ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. కార్మికులకు 16నుంచి 32 శాతానికి లాభాల వాటాను పెంచినట్లు గుర్తుచేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్, బీఆర్‌ఎస్ నాయకులు బడితెల సమ్మయ్య, సదానందం, కనుకయ్య, గౌరిపతిశర్మ, స్వామి, నర్సింగరావు, జగత్‌రావు, మల్లారెడ్డి, బుర్ర రమేష్, జనార్దన్, రవీందర్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు నుంచి పడి గీత కార్మికుడి మృతి


రమేశ్ మృతదేహం

రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేటకు చెందిన మాటూరి రమేశ్‌గౌడ్ (54) ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి పడి సోమవారం మృతి చెందాడు. వృత్తిలో భాగంగా ఎప్పటిలాగే తాటి చెట్టు ఎక్కాడు. కల్లు గీసే సమయంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో రమేశ్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు వచ్చి చూడగా అప్పటికే మరణించాడు. కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి రోదిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది. రమేశ్ మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

స్నానం చేసి వస్తానని వెళ్లి..


శ్రీనివాస్ మృతదేహం

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ పరిధి శనిగకుంటకు చెందిన ఆక శ్రీనివాస్(46) మల్లూరుగుట్టపై ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై గోదవరి రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు శ్రీనివాస్ ఆదివారం హేమాచల లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. స్నానం చేసి వస్తానని వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో ఉదయం కుటుంబ సభ్యులు గుట్టపైకి వెళ్లి వెతకగా ఎద్దు ముక్కు అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికకు చలి'మంట'లు

- చలికాగుతుండగా అగ్ని ప్రమాదం
- సరైన వైద్యం అందక రోదనలు


గాయాలతో రజిత

కొత్తగూడ: మండలంలోని మక్క చింతలపల్లి గ్రామానికి చెందిన 11 ఏళ్ల దివ్యాంగ బాలిక పాడిపశుల రజితకు ఈనెల 21న చలి కాగుతుండగా.. మంటలు అంటుకుని గాయాలైన విషయం పాఠకులకు తెలిసిందే. అదేరోజు బాలిక తల్లిదండ్రులు కొత్తగూడ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అప్పటి నుంచి మళ్లీ బాలికకు వైద్యం అందలేదు. కాలిన గాయాలతో చిన్నారి తీవ్ర వేదన పడుతోంది. ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులకు స్తోమత, అవగాహన లేకపోవడంతో స్థానికులు కొందరు చందాలు వేసి ఆర్థిక సాయం అందిస్తున్నారు. కనీసం బాధ కూడా చెప్పుకోలేక ఏడుస్తోందని, తమ బిడ్డకు చికిత్స అందించేందుకు అండగా నిలవాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించే గొంతుక..



కేయూ ఆడిటోరియం

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్

- కేయూలో ఈనెల 28 నుంచి ప్రారంభం
- ప్రముఖ చరిత్రకారుల రాక
- 1,030 వరకు పరిశోధన పత్రాల సమర్పణ
- మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ ఆతిథ్యమివ్వనున్న కేయూ
- చీఫ్ గెస్ట్‌గా సీఎం రేవంత్‌రెడ్డి!

కేయూ క్యాంపస్: దేశంలోని చారిత్రక అంశాలను వక్రీకరించినా.. వాటిని మార్చాలని చూసినా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ గొంతుకై నిలిచి ప్రశ్నిస్తుంది. దేశంలో ప్రతీ ఏటా జరిగే ఈ సెషన్‌కు ఈసారి కేయూ వేదికగా నిలవనుంది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ తర్వాత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్‌ను ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నారు.

మూడు దశాబ్దాల తర్వాత..

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 53వ సెషన్‌ను కాకతీయ యూనివర్సిటీలో అప్పటి వీసీ ఆచార్య జయశంకర్, హిస్టరీ విభాగాధిపతి బొబ్బిలి హయాంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. 30 ఏళ్ల తర్వాత కేయూలో మళ్లీ జరగనుంది. కాగా.. ఈసారి హిస్టరీ విభాగాధిపతి టి.మనోహర్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీగా ఉన్నారు. ఇందులో కేయూ వీసీ తాటికొండ రమేశ్ స్వాగతోపన్యాసం చేయనున్నారు.

1,030 పరిశోధనా పత్రాల సమర్పణ

దేశవ్యాప్తంగా చరిత్రకారులు, పరిశోధకుల నుంచి ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు 1,030 పరిశోధన పత్రాలు వచ్చాయి. ఇప్పటికే 750 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కాగా.. అదేరోజు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే వారూ ఉంటారు. 1,000 నుంచి 1,200లమంది ప్రతినిధులు వస్తారని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.

హిస్టరీ కాంగ్రెస్ చరిత్ర ఇదీ..

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 1935లో ఏర్పాటైంది. భారతదేశంలోని లౌకిక, శాస్త్రీయ దృక్పథంతో ఇది ముందుకు సాగుతోంది. ప్రముఖ చారిత్రకారులతోపాటు మొత్తం 35 వేల మంది ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నారు. దేశంలోని ఉన్నత విద్యా కళాశాలలు హిస్టరీ అధ్యాపకులతోపాటు యూనివర్సిటీల హిస్టరీ ఆచార్యులతోపాటు చారిత్రకంగా పరిశోధనలు చేసినవారు కూడా ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నారు. ఆవిర్భావం నుంచి ప్రతీ ఏటా ఒక రాష్ట్రంలో సెషన్‌ను నిర్వహిస్తున్నారు. గత ఏడాది మద్రాస్‌లో నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు జేఎన్‌యూ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జి, జనరల్ సెక్రటరీగా అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీబ్ రిజివి వ్యవహరిస్తున్నారు. కేయూలో జరిగే సెషన్‌కు వీరు కూడా రానున్నారు.

ఆరు సెషన్లలో పరిశోధనా పత్రాల సమర్పణ

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్‌లో కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు గదుల్లో మూడ్రోజులపాటు సెషన్లు జరగనున్నాయి. అందులో యాన్సింట్ ఇండియన్ ఇండియా హిస్టరీ సెషన్ జరగనుంది. దీనికి ప్రొఫెసర్ షాలిని షా అధ్యక్షత వహిస్తారు. మిడ్యూవల్ ఇండియా సెషన్‌కు ప్రొఫెసర్ నాజాఫ్ హైదర్ అధ్యక్షత వహిస్తారు. మోడ్రన్ ఇండియా సెషన్‌కు ప్రొఫెసర్ సాజల్‌నాగ్ అధ్యక్షత వహిస్తారు. కంట్రీ అదర్‌ధ్యాన్ ఇండియా సెషన్‌కు కేయూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎస్.శ్రీనాథ్ అధ్యక్షత వహిస్తారు. ఆర్కియాలజీ సెషన్‌కు ప్రొఫెసర్ సిమాభావా అధ్యక్షత వహించనున్నారు. కాన్‌టెంపరరీ ఇండియా (భారతదేశ సమకాలీన చరిత్ర) సెషన్‌కు ప్రొఫెసర్ కల్పనా కన్నాబిరాన్ అధ్యక్షత వహించనున్నారు. ఆయా చారిత్రక పరిశోధన పత్రాల్ని మూడ్రోజులపాటు సమర్పించనున్నారు.

కేయూలో ఏర్పాట్లు

మూడ్రోజులపాటు జరిగే ఈ సెషన్‌ను విజయవంతం చేయాలని వర్సిటీ వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, హిస్టరీ విభాగాధిపతి ఆ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ ఆచార్య మనోహర్ నెల రోజులుగా కృషి చేస్తున్నారు. అందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. హాజరయ్యే ప్రతినిధుల నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో కొంత, మరికొన్ని వర్సిటీ నుంచి నిధులను కూడా వెచ్చిస్తున్నట్లు తెలిసింది. ఈ సెషన్ నిర్వహణకు వ్యయం సుమారు రూ.60 నుంచి 70 లక్షలు అవుతున్నట్లు సమాచారం. కాగా.. ఉన్నత విద్యా మండలి రూ.90 వేలు మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. ప్రారంభ సమావేశాన్ని కేయూలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని ప్రయత్నిస్తున్నారు. ఒక వేళ సీఎం రాకపోతే మరెవరైనా ప్రముఖులు ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉంది.

సెమినార్.. లెక్చర్.. చర్చలు..

ఈ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్‌లో 'డెక్కన్ పాస్ట్ అండ్ ప్రజెంట్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. 'హిస్టరీ అండ్ ఇట్స్ ఐడియాస్' పై కూడా సెమినార్ ఉండనుంది. సనాతన ధర్మంపై లెక్చర్ ఉండనుంది. దేశంలోని సమకాలీన చారిత్రక అంశాలతోపాటు ఇతర దేశాలతో ఉన్న చారిత్రక సంబంధాలు తదితర అంశాలపై చర్చలుంటాయి. ఈనెల 28న ప్రత్యేక ఉపన్యాసాల్ని ప్రొఫెసర్ ఎస్‌సీ మిశ్రా మెమోరియల్ లెక్చర్‌ను ప్రొఫెసర్ కెఎల్ టుటేజా ఇస్తారు. సనాతన హ్యూమనిజమ్ స్పెషల్ లెక్చర్‌ను ప్రొఫెసర్ కేఎం శ్రీమాలి ఇవ్వనున్నారు. ఈనెల 29న సింపోజియం రీసన్ అండ్ ఐడియాలజీ ఇన్ ఇండియన్ హిస్టరీ అంశంపై ప్రొఫెసర్ మహాలక్ష్మి, ప్రొఫెసర్ సుబ్బరాయలు, ప్రొఫెసర్ అరుణ్ బండోపాధ్యాయ ప్రసంగిస్తారు.

తీర్మానాలు.. పరిశోధన పత్రాలు..

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ముగింపు సభలో పలు తీర్మానాలు చేయనున్నారు. ఈపరిశోధన పత్రాల సమర్పణ చేసిన వాటిని తర్వాత ప్రొసీడింగ్స్ రూపంలో పుస్తకాన్ని ప్రచురిస్తారు. ఈసెషన్‌లో చర్చించిన అంశాలు, తీర్మానాల్లో అవసరమైన వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తారు. చారిత్రక అంశాలను వక్రీకరించినా, మార్చాలని చూసినా అలాంటి వాటిపై ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ ప్రశ్నిస్తుంది.

ప్రముఖ చరిత్రకారుల రాక

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్‌కు ప్రముఖ చరిత్రకారులు రానున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ షిమాలి, జేఎన్‌యూ ప్రొఫెసర్లు వెల్లుతట్టి, శిరిన్ మోస్వీ, ప్రభాత్ పట్నాయక్, అమియాకుమార్, దయానందరాయ్, మహాలక్ష్మి, సుజన్ మహాజన, కేకే మండల్, మాలవికా బిన్ని తదితర చరిత్రకారులు హాజరుకానున్నారు.

ప్రతినిధులకు పలు చోట్ల వసతి

కేయూ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌కు వచ్చే ప్రతినిధులు కొందరికి నగరంలోని పలు హోటళ్లలో వసతి ఏర్పాటు చేశారు. బాల వికాస, దివ్య దీప్తిలో, వరంగల్ నిట్‌లో మరికొందరికి వసతి ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది ప్రతినిధులకు కేయూలోని రెండు హాస్టళ్లలో వసతి కల్పించనున్నారు. క్యాంపస్‌లోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్‌లో పురుషులకు, మహిళా ప్రతినిధులకు పద్మాక్షి మహిళా హాస్టల్‌లో వసతి కల్పించనున్నారు. అందుకోసం విద్యార్థులకు షార్ట్ టర్మ్ సెలవులు ప్రకటించారు. విద్యార్థులను ఖాళీ చేయించారు. ఇక మూడ్రోజులపాటు భోజన వసతిని కేయూలోని కామన్ మెస్‌లో ఏర్పాటు చేయనున్నారు. దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన వారికి రవాణా సౌకర్యం కల్పించనున్నారు.

పుస్తక ప్రియుల కోసం..

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ సందర్భంగా కేయూలోని ఆడిటోరియం వద్ద బుక్ ఫెయిర్ ఏర్పాటు చేయనున్నారు. చరిత్ర, పరిశోధనల పుస్తకాలు బుక్ ఫెయిర్‌లో అందుబాటులో ఉంటాయి. సాయంత్రం వేళ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

అందరి సహకారంతో అభివృద్ధి

- మంత్రి సీతక్క


శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సీతక్క

మంగపేట: ప్రజలు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి సహకారంతో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురంలో సోమవారం మంత్రి సీతక్క పర్యటించారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటిసారి మండలానికి వచ్చిన ఆమెకు పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా కమలాపురంలోని అపోస్తలుల క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు సీతక్క హాజరై యేసు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క ప్రజలకు సుపరిపాలన అందించేలా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ.. పాస్టర్ ఆదాం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అయ్యప్ప భక్తుల మృతి బాధాకరం

అయ్యప్ప భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని మంత్రి సీతక్క అన్నారు. ఈనెల 17న శబరిమలై యాత్రకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కమలాపురానికి చెందిన తలారి సుబ్బయ్యానాయుడు, నర్రా సాంబశివరావు, నిమ్మల రాజు (కొట్టు రాజు), జర్పుల రాము కుటుంబాలను సీతక్క సోమవారం పరామర్శించారు. ఈనెల 15న గోదావరిలో గల్లంతైన రామిశెట్టి రాము కుటుంబం, ఇటీవల మృతి చెందిన మధు, మారం కృష్ణ, కొత్తపల్లి చినబాబు కుటుంబాలను సీతక్క పరామర్శించారు.

భగవంతుడికి అనుసంధానించేదే పడిపూజ

- మంత్రి కొండా సురేఖ
- పడమరకోటలో మార్మోగిన శరణుఘోష


అయ్యప్పకు పూజలు చేస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్: భగవంతుడికి భక్తుడిని అనుసంధానించేదే అయ్యప్ప పడి పూజ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ పడమరకోటలో సాగర్ల శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేత గజ్జల శ్యామ్ నేతృత్వంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి నగర సంకీర్తన కార్యక్రమాన్ని పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆతర్వాత పడమరకోట గ్రామ బొడ్రాయిని దర్శించుకున్నారు. అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పోశాల సారంగపాణి, రవియాదవ్, నర్సింగం, బండి చందర్, మిట్టపెల్లి హరినాథ్, ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఎస్సై దిండిగాల రాజు పాల్గొన్నారు.

లోకానికి వెలుగై ఉన్న యేసు



కరుణాపురం చర్చిలో ఆశీర్వాదం ఇస్తున్న దైవజనులు పాల్‌సన్ రాజ్, జయ ప్రకాశ్, హాజరైన భక్తులు

- కరుణాపురం దైవ జనులు పాల్‌సన్ రాజ్, జయ ప్రకాశ్
- ఘనంగా క్రిస్మస్.. పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ /కాజీపేట రూరల్: ప్రపంచ మానవాళి రక్షణార్థం జన్మించిన యేసుక్రీస్తు ఈ లోకానికి వెలుగై ఉన్నాడని క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం ఫౌండర్స్ దైవ జనులు డాక్టర్ సంగాల పాల్‌సన్ రాజ్, జయ ప్రకాశ్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని క్రీస్తు జ్యోతి మందిరంలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్‌సన్ రాజ్ మాట్లాడుతూ.. బీద కన్య మరియ గర్భమందు క్రీస్తు జననం జనులను మేలుకొల్పిందన్నారు. దేశ ప్రజలందరిపై క్రీస్తు దీవెనలు, ఆశీర్వాదాలు ఉండాలని ఆయన ప్రార్థించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. క్రీస్తు జన్మదిన ప్రదేశాన్ని చూడడం అదృష్టంగా భావిస్తున్నానని, క్రీస్తు మార్గం ఆదర్శనీయమైందన్నారు.

ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ఘనంగా వేడుకలు


ఫాతిమా కేథడ్రల్ చర్చిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, బిషప్ ఉడుముల బాల

కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చి విచారణ గురువు కాసు మర్రెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడారు. క్రీస్తు సర్వమానవాళి పాప పరిహారార్థమై జన్మించాడన్నారు. కాగా.. ఆదివారం అర్ధరాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బిషప్ ఉడుముల బాల పాల్గొని కేక్ కట్ చేసి న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు, చర్చి కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఈవీ శ్రీనివాస్‌రావు, ఎండీ అంకూస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు పెళ్లలు మీద పడి లారీడ్రైవర్ మృతి!

- ఆలస్యంగా తెలిపిన కేటీపీపీ అధికారులు
- మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

గణపురం: మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్ ప్లాంట్‌లో అనుమానాస్పద స్థితిలో భూపాలపల్లి మండలం జంగేడు(ఫకీర్‌గడ్డ)కు చెందిన లారీ డ్రైవర్ బుర్ర కొమురయ్య (40) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేటీపీపీ కోల్ ప్లాంట్‌కు ఓసీ–3 ప్రాజెక్టు నుంచి జీఎస్ఎన్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ (టీఎస్03యూఏ6009) టిప్పర్ లారీని బొగ్గులోడ్ చేసుకుని సోమవారం ఉదయం వచ్చాడు. బొగ్గును అన్‌లోడ్ చేస్తుండగా.. పెళ్లలు మీద పడి కొమురయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కానీ కుటుంబ సభ్యులు మాత్రం కొమురయ్య అనుమానస్పదంగా మృతి చెందాడని, తమకు సమాచారం ఇవ్వకుండా ఉదయం మృతి చెందగా.. కొమురయ్య మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడమేంటని అనుమానం వ్యక్తం చేస్తూ.. ఆందోళనకు దిగారు. పోస్టుమార్టానికి తరలించిన మృతదేహాన్ని కుటుంబసభ్యులు, బంధువులు తిరిగి కేటీపీపీలోకి తీసుకెళ్లేందుకు యత్నించడంతో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట కొమురయ్య మృతదేహంతో ఆందోళనకు దిగారు. కొమురయ్య ప్రమాదవశాత్తు మృతి చెందలేదని, అతడి మృతిపై తమకు అనుమానం వుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై సోమవారం రాత్రి కేటీపీపీ అధికారులు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు చర్చించుకున్నారు. కానీ అధికారులు మాత్రం రాత్రి వరకు ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో ఆందోళన కొనసాగింది. ఘటనా స్థలికి చిట్యాల సీఐ వేణుచంద్, గణపురం ఎస్ఐ సాంబమూర్తి చేరుకొని భద్రతా చర్యలు చేపడుతున్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు


బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. 35 ఏళ్ల సింగిల్స్ విభాగంలో మొదటి బహుమతి ఎం.శ్రీకాంత్, డబుల్స్‌లో దిలీప్, ఎం.శ్రీకాంత్, మిక్స్‌డ్ డబుల్స్ విజేతలుగా ఎం.జీవన్‌రావు, కృష్ణవాణి విజేతలుగా నిలిచారు. 40 ఏళ్ల విభాగంలో విజేతలు సింగిల్స్ విభాగంలో విజేతగా ఎం.శ్రీకాంత్, డబుల్ విభాగంలో మొదటి బహుమతి ఎం.శ్రీకాంత్, ఎం.దిలీప్, ద్వితీయ బహుమతి కృష్ణ, సుమంత్, 45 ఏళ్ల విభాగంలో సింగిల్స్‌లో మొదటి బహుమతి షఫీ, ద్వితీయ బహుమతిగా జి.రాజేశ్, డబుల్స్ విభాగంలో విజేతలు ప్రథమ బహుమతి రమేశ్, శ్రీధర్, ద్వితీయ బహుమతిగా లక్ష్మారెడ్డి, నవీన్ విజేతలుగా నిలిచారు. 55 ఏళ్ల విభాగంలో సింగిల్స్‌లో కోటేశ్‌రావు, 60 ఏళ్ల విభాగంలో సింగిల్స్ విజేత కోటేశ్‌రావు నిలిచారు. ఈపోటీల్లో గెలుపొందిన విజేతలకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరపున బహుమతులు అందజేశారు. క్రీడాకారులను జీడబ్ల్యూఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్ లింగం, సూపర్‌వైజర్ రవి, కోచ్ మాడిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


దుప్పెల్లి భిక్షపతి (ఫైల్)

ఐనవోలు: మండలంలోని పెరుమాండ్లగూడేనికి చెందిన దుప్పెల్లి భిక్షపతి(57) ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భిక్షపతి కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంటి వద్ద కాలు జారి కింద పడగా.. కుటుంబీకులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నెబోయిన సందీప్(22) మృతి చెందాడు. మండలంలోని రాజవరానికి చెందిన సందీప్ గ్రామ సమీపంలోని ఓ రిసార్ట్‌లో పని చేస్తున్నాడు. అందులోనే పని చేస్తున్న ఎడ్ల వంశీతో కలిసి సోమవారం రాత్రి బైక్‌పై చిన్నపెండ్యాలకు వచ్చారు. వాహనంలో పెట్రోల్ పోయించుకునేందుకు బంక్‌కు వెళ్తుండగా.. ఇదే మండలం నష్కల్ గ్రామానికి చెందిన మోడెం శ్రీనుకు చెందిన టిప్పర్ వేగంగా యూటర్న్ తీసుకుంటుంటూ బైక్‌ను ఢీకొట్టింది. ఈక్రమంలో వెనుకాల కూర్చున్న సందీప్ ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా.. వాహనం నడుపుతున్న వంశీకి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలియగానే బంధువులు, గ్రామస్తులు సందీప్ మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై వినయ్‌కుమార్ నచ్చజెప్పేందుకు యత్నించారు. గంటన్నర పాటు వాహనాలు నిలిచాయి. సర్పంచ్ తిరుమల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ లలిత వ్యాంకుమార్‌రెడ్డి పోలీసులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బంధువులు తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించమని రోడ్డు పక్కన పెట్టారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు జట్ల ఎంపిక



ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఎంపికైన కేయూ జట్లతో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ మహిళా టోర్నమెంట్‌కు కేయూ వాలీబాల్ జట్టును ఎంపిక చేసినట్లు సోమవారం కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ శ్రీనివాస్‌రావు తెలిపారు. జె.సోనియా (వరంగల్ బొల్లికుంట వాగ్దేవి వ్యాయామ కళాశాల), ఎస్.అను, కావ్యాంజలి, వైష్ణవి (టీఎస్‌డబ్ల్యూ ఆర్డీసీ వరంగల్), కె.అనూష, ఆర్.హైమవతి (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల), సౌజన్య (కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల), ఎ.సోమ (విశ్వవిద్యాలయం, ఖమ్మం వ్యాయామ కళాశాల), ఉషారాణి (సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల), కె.భావన (కొత్తగూడెం టీటీడబ్ల్యూ ఆర్డీసీ ఉమెన్), టి.లావణ్య (ఖమ్మం టీటీడబ్ల్యూఆర్డీసీ), ప్రణతి (కిట్స్, హనుమకొండ), షేక్ ఆశాబేగం (కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నట్లు తెలిపారు. వీరికి కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.సావిత్రి వ్యవహరిస్తారని ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఖోఖో జట్టు

తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో ఈనెల 26నుంచి 30వరకు జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీలో ఖోఖో పోటీలకు కేయూ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్య పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈజట్టులో బి.అనూష, టి.తేజ (ఖమ్మం ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), కె.శిరీష, సంధ్యారాణి (కొత్తగూడెం టీటీడబ్ల్యూ ఆర్డీసీ ఉమెన్), ఇ.కృష్ణవేణి, కె.అంజలి, టి.రమ్య, ఎస్.అఖిల, పి.శృతి, ఎస్.నర్మద (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్), రశ్మిత, నవ్య (ములుగు టీటీడబ్ల్యూ ఆర్డీసీ), కె.దివ్య (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల,వా హనుమకొండ), ఎ.కావ్య (వరంగల్ ఎల్‌బీ కళాశాల), ఎస్.సోని (హనుమకొండ అరుణోదయ డిగ్రీ కాలేజీ) ఉన్నట్లు తెలిపారు. వీరికి మేనేజర్‌గా మహబూబాబాద్ టీటీడబ్ల్యూ ఆర్ ఫార్మసీ కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకురాలు బి.జ్యోతి వ్యవహరిస్తారని శ్రీనివాస్‌రావు తెలిపారు.

టెన్నిస్ జట్టు..

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం కృష్ణ యూనివర్సిటీలో ఈ నెల 27 నుంచి 30 వరకు జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ పురుషుల టోర్నమెంట్‌కు కేయూ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. కె.విశాల్ ఆదిత్య, పి.ప్రద్యుమ్ (కిట్స్, హనుమకొండ), బి.మురళి, ప్రవీణ్ (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), కె.శ్రవణ్ (టీటీడబ్ల్యూ ఆర్డీసీ, మణుగూరు) ఉన్నట్లు వివరించారు. వీరికి హనుమకొండ కిట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకటస్వామి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

టేబుల్ టెన్నిస్..

తమిళనాడులోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పురుషుల టోర్నమెంట్‌కు కేయూ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డ్ సెక్రటరీ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. పి.భరత్‌కుమార్, కె.దీపక్, జి.సాకిత్ యాదవ్, జి.నిఖిల్‌రెడ్డి (కిట్స్ కాలేజీ, హనుమకొండ), ఎం.ప్రణయ్ (కేయూ కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ) ఉన్నారు. వీరికి విశ్వవిద్యాలయం వ్యాయామ కళాశాల ఖమ్మం అధ్యాపకులు పి.కోటయ్య మేనేజర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.